క్లుప్తంగా

పేదలకు వరం వైఎస్సార్ బీమా



మృతుడి భార్యకు వైఎస్సార్ బీమా మొత్తాన్ని అందజేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోని టౌన్ : వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరం అని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మృతుడి భార్యకు బీమా మొత్తం రూ.90 వేల నగదును అందజేశారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న చిన్న అంజిని గతనెలలో ఊపిరితిత్తుల వ్యాధితో మృతిచెందాడు. ఆ సమయంలో బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందజేయగా మిగిలిన రూ.90 వేలను శనివారం మృతుడి భార్య లింగమ్మకు మనోజ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కాగా మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కౌన్సిలర్ చలపతి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మీదుగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజ్ తెలిపారు. శనివారం ఉదయం కేఏ 36సీ 1001 నంబరు గల లారీలో 40 సంచులు (ఒక సంచి 40 కిలోలు) మొత్తం 16 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. ఇందులో కొత్తపేట గ్రామానికి చెందిన త్రినేత్ర, రాయచూరుకి చెందిన శివరాజ్, చిలకలడోణ గ్రామానికి చెందిన నాగరాజును అరెస్టు చేసి బియ్యం, లారీని సీజ్ చేశామని వివరించారు.

1న శనిత్రయోదశి పూజలు

ఆదోని అర్బన్: మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు జూలై 1న శనిత్రయోదశి సందర్భంగా స్థానిక మంగరాయ సన్నిధిలో దోష పరిహార పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు శనివారం తెలిపారు. వేకువజామున మంగరాయ ఆంజనేయస్వామికి తేనాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, ప్రత్యేకంగా పూలు, వెండి, మహామంగళహారతి పూజలు ఉంటాయని చెప్పారు. అనంతరం శనీశ్వరస్వామికి తిలతైలాభిషేకం, మృత్యుంజయహోమం, శాంతి హోమం జరిపిస్తామని వివరించారు.

అధికారుల గైర్హాజరు తగదు

కౌతాళం: మండల సర్వసభ్య సమావేశం, ఇతర రోజుల్లో జరిగే సమావేశాలకు మండలంలోని వివిధ శాఖల అధికారులు కొందరు గైర్హాజరవుతున్నారని, అలాంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, ఎంఈఓ వివిధ శాఖల అధికారుల రాకపోవడంపై ఎంపీపీ అమరేష్, డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రాకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు.

జూలై 2న ఉచిత వైద్య శిబిరం

ఆదోని అర్బన్ : జూలై 2వ తేదీన స్థానిక వాసవీ కల్యాణ మందిరంలో ఆవోపా, మహిళా విభాగ్ ఆధ్వర్యంలో సంతానం లేనివారికి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఆర్‌ఐ, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు నాగేష్ కాకుభాల్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని వైట్ హౌస్‌లో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. గత వారం ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించి 253 మందికి ఆపరేషన్లు చేయించామన్నారు. అలాగే సంతానం లేని వందమందికి ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అర్హులైన వారికి సెమిన్‌ఎనాలిసిస్, ఐయూఐ టెస్ట్, ఐవీఎఫ్ కన్సల్టేషన్ పరీక్షలు ఉచితంగా కర్నూలులోని ప్రైమ్ ప్లస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఉచితంగా చేస్తామని చెప్పారు. ప్రతి జంటకు రూ.25 వేలు విలువజేసే వైద్యాన్ని భరిస్తామన్నారు. సంతానం లేనివారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ 8977778184, 9550444641 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆవోపా అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తా, సెక్రటరీ మిరియాల శ్రీధర్, సభ్యులు రంగనాయకులు, మహిళా విభాగ సభ్యులు సంగీత, మమతశ్రీ, హిమబిందు, గీత పాల్గొన్నారు.

ఆటో ఢీ.. నలుగురికి గాయాలు

మంత్రాలయం రూరల్: చెట్నేహళ్లి గ్రామ చర్చి సమీపంలో గ్రామానికి చెందిన వలంటీరు కురువ హనుమంతు, బోయ రమేష్, హరిజన రాజు శనివారం రాత్రి దారి పక్కలో నిలబడి మాట్లాడుకుంటుండగా తుంగభద్ర గ్రామానికి చెందిన ఆటో అటుగా వెళ్తూ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి డ్రైవర్‌తో పాటు నిలిచిన ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. పందిని తప్పించబోయి వారిని ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. వీరిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తరలించారు. కాగా.. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు.

బైక్ కింద పడి..

మండలంలో మాలపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడటంతో ఆదోనికి చెందిన చంద్రన్న అనే వ్యక్తికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ప్రాంతీయ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. మంత్రాలయం మండలంలోని తుంగభద్ర గ్రామానికి వచ్చి తిరిగి ఆదోనికి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుందని బాధితుడు తెలిపాడు.

బడుగుల లోగిళ్లలో ఉచిత వెలుగులు

- ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- నియోజకవర్గంలో 9,021 కుటుంబాలకు లబ్ధి
- నెలకు సబ్సిడీ రూ.23.6 లక్షలు



కౌతాళం ఎస్సీ కాలనీ

మంత్రాలయం: తెలుగుదేశం హయంలో ఎస్సీ, ఎస్టీల గృహాలకు 50 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేవారు. 2019 ఎన్నికల సమయంలో ఆ ఉచితాన్ని 125 యూనిట్లకు పెంచారు. 125 యూనిట్లు మించి ఒక్క యూనిట్ అదనంగా వినియోగించినా ప్రతి యూనిట్‌కు బిల్లులు వసూలు చేశారు. దీంతో ఎంతో మంది ఎస్సీ, ఎస్టీలు పెద్దగా లబ్ధి పొందలేకపోయారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిస్థితులను అర్థం చేసుకుని ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచింది. తదనుగుణంగా లబ్ధిదారుల సంఖ్య రెట్టింపు అయ్యింది. నేడు పేదల లోగిళ్లలో నేడు ఉచిత విద్యుత్ వెలుగులు నిండాయి. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

9,201మందికి లబ్ధి..

మంత్రాలయం నియోజకవర్గంలో 18 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ వర్గీయులున్నారు. అందులో 9,201 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతోంది. ప్రతి నెల లబ్ధిదారులకు రూ.23.6లక్షల సబ్సిడీ ఖర్చు చేస్తోంది. అత్యధికంగా కౌతాళం మండలంలో 3,232 కనెక్షన్లకు గానూ రూ.8.85 లక్షలు, మంత్రాలయం మండలంలో 2,086 కనెక్షన్లకు గానూ రూ.5.24లక్షలు, పెద్దకడబూరు మండలంలో 1,747 కనెక్షన్లకు రూ.4.79 లక్షలు, కోసిగిలో 1,956 కనెక్షన్లకు రూ.4.72 లక్షలను ప్రభుత్వం భరిస్తుంది. నియోజకవర్గంలో మొత్తం 8,478 ఎస్సీ సర్వీసులు, 443 ఎస్టీ సర్వీసులున్నాయి. ఏడాదికి రూ.60 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

మండలం	ఎస్సీ సర్వీసులు	ఎస్టీ సర్వీసులు	సబ్సిడీ మొత్తం
కోసిగి	1811	45	రూ.4.72 లక్షలు
మంత్రాలయం	1854	232	రూ.5.24 లక్షలు
పెద్దకడబూరు	1731	16	రూ.4.79 లక్షలు
కౌతాళం	3082	150	రూ.8.85 లక్షలు
మొత్తం	8478	443	రూ.23.60 లక్షలు

ఉచితంతో మేలు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా కల్పించారు. ఉచిత విద్యుత్‌తో ఎంతో మంది పేద ఎస్సీ, ఎస్టీలకు మేలు జరుగుతోంది. టీడీపీ హాయంలో కేవలం 125 యూనిట్ల విద్యుత్ ఇవ్వడంతో చాలమందికి న్యాయం చేయలేక పోయారు. నాలుగేళ్లుగా కరెంట్ బిల్లు పైసా కట్టలేదు.

– స్వామి దాసు, కౌతాళం

200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడం సంతోషకరం



జగనన్న వచ్చాక 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. మా ఇంటికి ఈ పథకం వర్తించింది. నాలుగేళ్ల నుంచి ఒక్క రూపాయి కూడా విద్యుత్ బిల్లు చెల్లించలేదు. చాలా సంతోషంగా ఉంది.

– చంద్రశేఖర్, జంపాపురం

జగనన్న సురక్షతో ప్రతి సమస్యకు పరిష్కారం



జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్, తహసీల్దారు



పదో వార్డులో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

కౌతాళం: జగనన్న సురక్షతో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం మండలంలోని నదిచాగి గ్రామంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకుని వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి టోకెన్ నంబర్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆర్‌ఐ రాజశేఖర్, ఎంపీటీసీ లింగన్నగౌడ్ పాల్గొన్నారు.

మంత్రాలయం: మండలంలోని వగరూరు గ్రామ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారించాలని సూచించారు.

ఆదోని టౌన్ : ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జగనన్న సురక్ష సర్వే శనివారం శ్రీకారం చుట్టారు. కమిషనర్ రఘునాథ్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ అస్లామ్, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేషనల్ స్కూల్ ఎదురుగా ఉన్న పార్కును సందర్శించారు.

మంత్రాలయం రూరల్: సంక్షేమ పథకాలు అర్హులై ఉండి ఏ కారణంచేతనైనా అందకపోయి ఉంటే అందేలా చేస్తామని, మీ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారి నారాయణ మూర్తి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరీ సూచించారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా మండలంలో కాచాపురం, చిలకలడోణ గ్రామం సచివాలయం 1, 2 పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు.

కోసిగి: స్థానిక సచివాలయం –1 పరిధిలోని బుళ్లోళి గేరి, పర్సా గేరి, బసవన్న కొండ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఎంపీపీ ఈరన్న ప్రారంభించారు. మొదటి రోజున సచివాలయ కన్వీనర్ బుళ్లి నరసింహులు, గృహ సారథులు, వలంటీర్లుతో కలిసి ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను 11 అంశాల పై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆపస్మారక స్థితిలో కుమ్మరి ఈరన్న

కోసిగి: మండలంలోని గౌడుగల్లు గ్రామానికి చెందిన కుమ్మరి ఈరన్న అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈరన్న మూడేళ్లుగా భార్య, పిల్లలను కోసిగిలో వదిలేసి బెంగళూరుకు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. ఇటీవల బెంగళూరులో బిల్డింగ్‌పై నుంచి కిందపడటంతో చేయి విరిగిపోయింది. దీంతో మూడు రోజుల క్రితం సొంత గ్రామం గౌడుగల్లుకు వచ్చాడు. భార్య ఇంటికి వెళ్లి పిలిచినా రాకపోవడంతో మనస్థాపంతో పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అపస్మారక స్థితిలో పడి ఉండగా ఆటోలో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటాడాయి. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, అగసలదిన్నెలోని, ఎరిగేరిలోని పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామతాభిషేకం తదితర పూజలు చేపట్టారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

పెద్దకడబూరు: కంబదహాల్ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ పథకం కింద రూ.1.33కోట్లు మంజూరయ్యాయని, వాటితో గ్రామంలో ఇంటింటికీ నీటిని అందించేందుకు చర్యలు చేపడుతుంటే టీడీపీ నాయకులు సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారని దుష్ప్రచారం చేస్తుండటాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ పార్టీ నాయకులు ఎన్ని వేషాలు వేసినా జనం విశ్వసించరన్నారు. త్వరలో ప్రతి ఇంటికి నీరందించే పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

కోసిగి: మండలంలోని దొడ్డి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. శనివారం పాఠశాల ఆవరణలో ఎం.మహేశ్వరి, ఎం.ప్రవళ్లిక, బి.శ్యామలను మాజీ సర్పంచ్ నరసన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. పీఎంసీ చైర్మెన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులను సన్మానించిన దృశ్యం

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే గిరిజన పాఠశాలలు మూత

- ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి

ఆలూరు రూరల్: ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలు (బాలుర, బాలికల) మూత పడ్డాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. వంట నిర్వాహకులు లేని కారణంగా విద్యార్థులు పాఠశాలలకు రావడం లేదని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శనివారం ఆయన పాఠశాలలకు చేరుకుని విచారణ చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గతంలో వంట నిర్వాహకులను నిబంధనలకు విరుద్ధంగా నియమించారన్నారు. కొన్ని రోజుల పాటు వీరికి ఎస్టీ వెల్ఫేర్ ఫండ్ నుంచి కొంత మొత్తాన్ని చెల్లించామన్నారు. వంట నిర్వాహకులను అప్కాస్‌లోకి తీసుకోవాలని ఫైల్ సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు వర్కర్లు, ఒక వాచ్‌మెన్, కామాటి పనిచేస్తున్నా.. గతంలో పనిచేసిన వంట నిర్వాహకులను రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వంట నిర్వాహకులు లేరని తప్పుడు సమాచారం ఇచ్చి



విచారణ చేస్తున్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి

పాఠశాల మూత వేశారన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఎస్సీ ఈడీ శ్రీనివాస్ కుమార్ ఉన్నారు.

తెరుచుకున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు

ఉన్నతాధికారుల చొరవతో శనివారం ఆలూరు గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. గిరిజన బాలుర పాఠశాలలో 250 మంది, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 310 విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు వర్కర్లతో వంట చేయించేలా చర్యలు తీసుకున్నారు.

టైర్ పగిలి.. గాల్లోకి ఎగిసిన కారు

పెద్దవడుగూరు: టైర్ పగలడంతో కారు ఒక్కసారిగా గాల్లోకి లేచి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. శనివారం ఉదయం పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనలో తాడిపత్రి సమీపంలోని సిమెంట్ పరిశ్రమ ఉద్యోగి వీరేష్, అతని కుమారుడు బీశ్వంత్, కుమార్తె నిహారిక గాయపడ్డారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన వీరేష్ శనివారం ఉదయం తన సొంతూరుకి కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్తుంతుండగా ప్రమాదం చోటు చేసుకుంది.



ప్రమాదానికి గురైన కారు

భార్యకు ఎలాంటి గాయాలు కాలేదు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదంపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అన్ని అనుమతులతోనే స్మార్ట్‌టౌన్‌షిప్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వర్గాలవారి కోసం బనవాసి వద్ద అన్ని అనుమతులతోనే జగనన్న ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు విక్రయిస్తున్నట్లు కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శనివారం మున్సి పల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలోమాట్లాడారు.

జగనన్న పాలనలో విద్యకు ప్రోత్సాహం



విలేకరులతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోని టౌన్ : జగనన్న పాలనలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని, ప్రతి పేదోడు విద్యనభ్యసించాలన్న ఉద్దేశ్యంతో కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఆయన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారంటే వాటికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవాలన్నారు. సీట్ల కోసం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, తమను, పార్టీ కార్యకర్తలు, నాయకులను ఆశ్రయిస్తూ ఎలాగైనా సీట్లు ఇప్పించాలని కోరుతుండటం చూస్తే సర్కారు బడులకు వైభవం లభించినట్లేనన్నారు. ఆరేకల్ గురుకుల పాఠశాల, కస్తూర్బా స్కూల్, గర్ల్స్ హైస్కూల్, మున్సిపల్ హైస్కూళ్లకు డిమాండ్ అధికంగా ఉందన్నారు. ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని సీఎం హామీ ఇచ్చి నెరవేర్చారని చెప్పారు.

పోరాటాలకు సిద్ధం కండి

ఆదోని రూరల్ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా నాయకుడు అంజిబాబు పిలుపునిచ్చారు. రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్ అధ్యక్షతన జరిగాయి. పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి, తిప్పన్న, ముక్కన్న, నాగరాజు, వీరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొలాల్లో పైపులు చోరీ

కోసిగి: మండలంలోని దుద్ది గ్రామ సమీపంలోని ఓరుగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలోనున్న పొలాల్లో ఏర్పాటు చేసుకున్న సాగునీటి టూబ్ పైపైపలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కోసిగికి చెందిన ఉరుకుందప్ప పొలంలో 250 మీటర్లు పైపు, రాఘవయ్య రైతు పొలంలో 300 మీటర్లు టూబ్ పైప్ చోరీ చేశారని బాధితులు వాపోయారు. పదిరోజుల క్రితం పెండేకంటి నరసన్న పొలంలో బోరు విద్యుత్ వైర్లు , పైపులు దొంగలించిన విషయం తెలిసిందే.

తల్లీకూతురు అదృశ్యం

మంత్రాలయం రూరల్: మండలంలోని చిలకలడోణ గ్రామానికి చెందిన వివాహిత మహాలక్ష్మి (20), అమె ఏడాదిన్నర కుమార్తె మానస అదృశ్యమయ్యారని భర్త హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి పాపతో పాటు తల్లి కనిపించడంలేదని, వారిని చెట్నేహళ్లి గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు తీసుకెళ్లి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నారని, వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: విశాఖ జ్ఞానానందాశ్రమంలో రెండేళ్లుగా బాలికపై అత్యాచారానికి పాల్పడిన పూర్ణానందస్వామిపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ డివిజన్ కమిటీ నాయకులు అశోక్, మేఘన, నిఖిత, కృష్ణవేణి కోరారు. పట్టణంలోని ఎమ్మిగనూరు కూడలిలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆశ్రమంలో జరుగుతున్న అకృత్యాలపై కమిటీ వేసి ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోనున్న శ్రీవైష్ణవి, జీనియస్ గ్లోబల్ ప్రైవేటు పాఠశాలలో ఎంఈఓలు మెయినుద్దీన్, రాఘన్న శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తదితర వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అనుమతులు లేకుండా పాఠశాలను కొనసాగిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వారు తనిఖీలు చేపట్టారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించామని ఎంఈఓ మెయినుద్దీన్ పేర్కొన్నారు. సీఆర్‌పీలు నరసన్న గౌడు, భీమేష్, బంగారప్ప ఉన్నారు.

నీటిని సక్రమంగా సరఫరా చేయండి

కౌతాళం: మండల కేంద్రంలో మంచినీటిని సక్రమంగా, సమృద్ధిగా సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు. శనివారం ఎంపీపీ అమరేష్, సర్పంచ్ పాల్‌దినకర్‌కు వారు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకులో నీరు సమృద్ధిగా ఉన్నా సరఫరా చేయడం లేదని, మోటార్ల సమస్య, ఫిల్టర్ బెడ్ మరమ్మతులు, పైప్ లైన్ లీకేజీ పేరుతో 15 రోజులకొకసారి వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నీటి కోసం అవస్థలు పడుతున్నామని, వెంటనే పరిష్కరించాలని కోరారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

ఆదోని సెంట్రల్: ప్రైవేట్, కార్పొరేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు దస్తగిరి కోరారు. ఎంఈఓ కార్యలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు కుండా సొంతంగా పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నారని చెప్పారు. ఫీజు రెగ్యులేషన్ చట్టాన్ని అమలు చేసి ఫీజుల దోపిడీకి చెక్ పెట్టాలని డిమాండ్ చేశారు.నాయకులు వీరేష్, రవి, రాజు, ప్రభాకర్, షబ్బీర్, రవికుమార్,మల్లి పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండలంలో అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు వీరేష్ కోరారు. విద్యార్థులతో కలసి ఎంఈఓ మొయినుద్దీన్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన రుసుము కంటే అధికంగా వసూలు చేస్తున్నాయన్నారు. ఎంఈఓ స్పందిస్తూ..పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు అభి, యాకోబు, భీమేష్, జయరాం పాల్గొన్నారు.

రీసర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కర్నూలు కల్చరల్ : రెండో దశ కింద గ్రామాల్లో చేపట్టిన రీసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అంశాలపై జిల్లాలోని డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రెండో దశలో కర్నూలు రెవెన్యూ డివిజన్ కింద 26 గ్రామాల్లో రీసర్వే పనులు జరుగుతున్నాయన్నారు. అందులో ఓర్వకల్లు, కర్నూలు రూరల్, వెల్దుర్తి మండలాల్లో పురోగతి చాలా తక్కువగా ఉందన్నారు. పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూహక్కు పత్రాల పంపిణీ సమయంలో తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగేశ్వరరావు, డివిజన్, మండల స్థాయి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నాసిరకం గుడ్లు సరఫరా చేస్తే చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లను సరఫరా చేసినట్లు అయితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హెచ్చరించారు. శనివారం జేసీ చాంబర్‌లో ఐసీడీఎస్, పౌర సంబంధాల అధికారులు, కాంట్రాక్టర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సకాలంలో చేర్చాలన్నారు. కాంట్రాక్టర్ల సమయం ముగియడంతో మరో రెండు నెలలు పొడిగించామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి, కర్నూలు సీడీపీవో అనురాధమ్మ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆచార్యులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోరా?

- మండలమీట్‌లో అధికారులపై సభ్యుల ధ్వజం
- సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ఆగ్రహం

కౌతాళం: సమస్యలు ప్రస్తావిస్తే పరిష్కరించకపోతుండటంతో ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని, పనితీరు మార్చుకోరా అంటూ ప్రజాప్రతినిధులు అధికారులపై ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమరేష్ అధ్యక్షతన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ సుబ్బరాజు సభను ప్రారంభించి వివిధ అంశాలను వివరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల వ్యవసాయాధికారి శేషాద్రి మాట్లాడుతుండగా బంటకుంట సర్పంచ్ గోపాల్ రెడ్డి లేచి సుళేకేరి గ్రామ సచివాలయ సిబ్బంది తిరుమల్‌నాయక్ ఇన్‌పుడ్ సబ్సిడీ కింద రూ.13 లక్షలు వసూలు చేసినా ఇప్పటి వరకు ఎంలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కేవలం సస్పెండ్ చేసి వదిలేసి, ఆ మొత్తాన్ని రైతులకు ఇప్పించలేదని మండిపడ్డారు. ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న మాట్లాడుతూ మండలంలో కొంత వరకు లోఓల్టేజ్ సమస్య ఉందని, ఇటీవల వర్షాలకు మండలంలో 95 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని వాటి స్థానంలో కొత్తవి వేశామన్నారు. ట్రాన్స్‌కో పనితీరు మండలంలో బాగలేదని ఏ గ్రామంలో చూసినా సమస్యలు ఉన్నాయని సర్పంచులు, ఎంపీటీసీలు ఏఈని నిలదీశారు. కామవరం సర్పంచ్ వసంత మాట్లాడుతూ గ్రామ సమీపంలోనున్న చెరువులో విద్యుత్ తీగలు కిందకు ఉండడంతో గత నవంబర్‌లో ఒకరు మృతి చెందారని, తీగలు సరిచేయాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని నిలదీశారు. స్తంభాలు మార్చడానికి డీడీ తీసి నెల గడుస్తున్నా ఫలితం లేకపోయిందన్నారు. మల్లనహట్టి గ్రామంలో పంచాయతీ భవనం ముందు ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, మార్చలని రెండు సంవత్సరాల నుంచి అడుగుతున్నా పట్టించుకోలేదని ఆ గ్రామ సర్పంచ్, కార్యదర్శి మోగేశ్వర్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పటికే గతంలో ఇక్కడ రెండు గొర్రెలు మతి చెందగా ఒకరు విద్యుత్‌షాక్‌కు గురయ్యారని, ఈ విషయం తెలిసినా మార్చకపోవడంలో నిర్లక్ష్యం కాకపోతే మరేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడూరు లో పాత విద్యుత్ స్తంభాలు మార్చలని కోరినా ఇప్పటి వరకు మార్చలేదని సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా పనిచేయకపోతే గ్రామాల్లో తాము సమాధనం ఎలా చెప్పాలని ప్రశ్నించారు. ఏరిగేరి గ్రామంలో ఇలాంటి పరిస్థితు ఉందని సర్పంచ్ గోవింద్ అన్నారు. కాత్రికి గ్రామంలో మూడు రోజులకొకసారి తాగునీరు అందించే విద్యుత్ మోటార్ కాలిపోతుందని ఎన్నిసార్లు చెప్పాలని ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నదిచాగి గ్రామంలో పది మంది రైతులు కలిసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారని అయిన వారు చెప్పిన స్థానంలో కాకుండా మరోచోట ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు చెబుతున్నా మార్చడం లేదని ఎంపీటీసీ లింగన్నగౌడు తెలిపారు. హౌసింగ్ ఏఈ గోపినాథ్‌వర్మ మాట్లాడుతూ మండలంలో 596 మందికి రూ. 20 వేల ప్రకారం జమచేశామన్నారు. ఏరిగేరి సర్పంచ్ గోవిందు మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని, జియోట్యాగింగ్ అయిన ఇళ్లకు బిల్లులు చేయకుండా, పదేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లకు బిల్లులు చేశారని జాబితా ప్రదర్శించి మండిపడ్డారు. అన్ని చోట్ల ఇలాంటి సమస్యలే ఉన్నాయని వివిధ గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు. ఇక నుంచి సమస్యలు పునరావృతం కాకుండా పని చేయాలని డిప్యూటీ కలెక్టర్ అధికారులకు సూచించారు. కౌతాళంలో నీటి ఎద్దడికి మరో రెండు ఓహెర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాలని సర్పంచ్ పాల్‌దినకర్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి లక్ష్మినారాయణ, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసమే ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీస్తున్నారని, వారిని అర్థం చేసుకొని పనిచేయాలని సూచించారు. మండలంలో నిరక్షరాస్యత అధికంగా ఉందని, ప్రజాప్రతినిధుల్లో చాలా మంది కూడా నిరక్షరాస్యులను వారి ఆవేదనను అర్థం చేసుకొని పనిచేయాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అమరేష్